

నేటి దినపత్రిక

# సూర్య

19వ వసంతంలోకి ...

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

సోమవారం,16 మార్చి 2026 | 8 పేజీలు


### పదవ తరగతి పరీక్షలు రాస్తున్న

## విద్యార్థులందరికీ ఆల్ ద బెస్ట్..!

**- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాయండి. మీరు పడిన కష్టానికి తగిన ఫలితం తప్పకుండా వస్తుంది, ఉన్నత స్థాయికి ఎదుగుతారు. భయం లేకుండా, మీ ప్రతిభను నమ్ముకుని, ఉత్తమ ప్రదర్శన కనబరచండి. మీ భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షిస్తూ, విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు.పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శుభాకాంక్షలు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నానని ఆల్‌దిబెస్ట్ చెప్పారు.విద్యార్థులు నియమనిబంధనలు తప్పని సరిగా పాటించాలని, సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సూచించారు. సమయాన్ని సద్వి నియోగం చేసుకుని పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్ష జరుగు తుంది. కాకినాడ జిల్లాలో ఈసారి పదో తరగతి



పరీక్షలకు మొత్తం 28,921 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 145పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ఎగ్జామ్ సెంటర్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు మొత్తం 6 సబ్జెక్టులకు గాను 7పేపర్లు పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు.

### నేటి నుండే ఉన్నత చదువులకు తొలిమెట్టైన

## పదో తరగతి పరీక్షలు ప్రారంభం

**- జిల్లా కలెక్టర్**

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు పబ్లిక్ పరీక్షల పట్ల భయాందోళనలను విడనాడి విజేతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా ఆల్ ది బెస్ట్ శుభాకాంక్షలు తెలిపారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థిని విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టమని,ఈసమయంలో భయాందోళన లకు లోనవ్వడం సహజమని అయితే సరైన ప్రణాళికతో ఒత్తిడిని అధిగమించి మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎంతోమంది ఉన్నత స్థానాలకు ఎదిగారని అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని కష్టమైనా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సమాజంలో మంచి పేరు తెచ్చుకుని స్థిరపడాలనే ఆశతో ఎంతోమంది తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారన్నారు. విద్యార్థు లు తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని రెట్టింపు చేసేలా ఫలితాలు సాధించాలన్నారు.విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది పదవ తరగతి పరీక్షలేనని, తర్వాత ఈ పరీక్షలు పాస్ అయితే ఉన్నత చదువులు చదివేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. ఈ నెల 16 నుండి ఏప్రిల్ ఒకటి వరకు నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో జిల్లావ్యాప్తంగా



19,310 విద్యార్థులకు 108 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేసినట్లు తెలిపారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థినీ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులలో భయాందోళనలను పోగొట్టేందుకు ప్రణాళి కాబద్ధమైన ప్రిపరేషన్ ఉండాలని అన్ని సబ్జె క్టులకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ఒక చదువుల ప్రణాళికను సిద్ధం చేసు కోవాలన్నారు. కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలన్నారు

- తరువాయి 2లో..

### గ్యాస్ సరఫరాపై

## ఆందోళన వద్దు

- కమర్షియల్ వాడకాలపై పూర్తి నిఘా
- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్
- జిల్లాలో నిరంతరాయంగా ఎల్పీజీ సిలిండర్ల పంపిణీ
- బుకింగ్ ఆధారంగానే డెలివరీ
- వినియోగదారుల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 8886903611 ఏర్పాటు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిల్లాలో గృహ అవసరాలు, విద్యార్థుల వసతి గృహాలు మరియు అత్యవసర సేవల నిమిత్తం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ స్పష్టం చేశారు.గ్యాస్ కొరతఉందనే తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, జిల్లాలోని గ్యాస్ నిల్వలు మరియు పంపిణీ సరళిని వివరించారు.



**సాధారణ స్థితిలోనే సరఫరా..**కాకినాడ జిల్లాకు అవసరమైన గ్యాస్ సిలిండర్లు ఐఓసీ విశాఖపట్నం నుండి, హెచ్‌పీ గుమ్మలదొడ్డి మరియు విశాఖ నుండి, అలాగే బిపిసిఎల్ కాకినాడ పోర్టులోని బాట్లింగ్ ప్లాంట్ నుండి ప్రతిరోజూ సాధారణ స్థాయిలో

- తరువాయి 2లో..

### వెంకటేశ్వర స్వామి

## ఆలయ పునర్నిర్మాణానికి అంకురార్పణ







- కూళ్ళ గ్రామంలో రూ.కోటి రూపాయలతో త్వరలో ఆలయ నిర్మాణం
- కూళ్ల గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం

**కె.గంగవరం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె.గంగవరం మండలం కూళ్ల గ్రామంలో కోటి రూపాయల పుష్కర నిధులతో నిర్మించనున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయపునర్నిర్మాణానికి అంకురార్పణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా స్వామివారి విగ్రహాలను బాలాలయంలోకి తరలించే పూజాకార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ ఈ ఆలయం అభివృద్ధి చెందేలా కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.

**చిట్టూరి రామ్మోహన్రావు సేవలు అభినందనీయం**

కూళ్ల గ్రామానికి టిడిపి నాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయులు చిట్టూరి రామ్మోహన్రావు చేస్తున్న సేవలు అభినందనీయమని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ఆయన సొంత నిధులను వెచ్చించి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.

**డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి రక్షణ స్లాబ్ నిర్మాణానికి శంకుస్థాపన**

గ్రామంలో ఉన్న డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహం రక్షణ కోసం పై స్లాబ్ నిర్మాణానికి రూ.1.50 లక్షలతో చేపట్టనున్న పనులకు వాసంశెట్టి సత్యం, చిట్టూరి రవీంద్ర కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.

**మత్స్యకారుల మార్కెట్ షెడ్ ప్రారంభం**

- తరువాయి 2లో..

# పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



అడ్డతీగల, మేజర్ న్యూస్ : సోమవారం నుంచి రగనున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు అడ్డతీగల రెండవ మండల విద్యాశాఖ అధికారి పి.శ్రీనివాస్ పేర్కొన్నారు.

అడ్డతీగల లోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు బాలికల ఆశ్రమ పాఠశాలతో పాటు వేటమామిడి లోని హోసన్న ప్రైవేటు పాఠశాలను ప్రభుత్వం పదవ తరగతి పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు.

ఆయా కేంద్రాల వద్ద విద్యార్థుల సౌకర్యార్థం మంచినీళ్లు సరిపడా బెంచీలు అలాగే వైద్య సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు సలహాలు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి ఆదివారం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

# అత్యాధునిక పోలీస్ నిఘా నీడలో నూజివీడు పట్టణం

**నూజివీడు ,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, ఆదేశాల పై డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ పర్యవేక్షణలో టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్య శ్రీనివాస్ నూజివీడు పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఈ కెమెరా లన్నింటినీ నూజివీడు పోలీస్ స్టేషన్‌లోని సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. దీని ద్వారా పట్టణంలో జరిగే ప్రతికదలికను పోలీసులు 24/7 పర్యవేక్షించనున్నారు .కెమెరాల నిఘా ఉందని తెలియడం వల్ల నేరస్థులు నేరాలకు పాల్పడటానికి వెనుకాడుతారు. ఇది' డిటెరెన్స్ గా పనిచేస్తుంది. ఏదైనా దొంగతనం,చైన్‌స్నాచింగ్ లేదా అసాంఘిక కార్య కలాపాలు జరిగినప్పుడు, నిందితులను గుర్తించడానికి ,వారి కదలికలను ట్రాక్ చేయడానికి ఈ దృశ్యాలు కీలక సాక్ష్యాధారాలుగా మారుతాయి.పట్టణం లోని కూడళ్ల లో ట్రాఫిక్ జామ్ కాకుండా చూడ టానికి, నిబంధన లు ఉల్లంఘించే వాహన దారులను గుర్తించ డానికి ఈ నిఘా వ్యవస్థ ఉపయోగ పడుతుంది.శాంతిభద్రతల పరిరక్షణలో ఊరే గింపులు, పండుగలు లేదా రాజకీయ సభల సమయంలో జన సందోహాన్ని నియం త్రించడానికి ,ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా



నివారిం చడానికి ఇది తోడ్పడుతుంది.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ నేర రహిత నూజి వీడును తయారు చేయడమే మా లక్ష్యం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయో గించి నేరాలను అదుపు లోకి తీసుకొస్తాం. ప్రజలు కూడా తమ ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలి అని కోరారు.రహదారి ప్రమాదాల నివారణ కొరకు ఇసుకతో నింపిన ప్లాస్టిక్ డ్రమ్ములను, రేడియం స్టిక్కర్లను అతికించి రహదారిపై ఉంచిన టౌన్ ఇన్స్పెక్టర్ సత్య శ్రీనివాస్ సిబ్బంది.

# డ్రగ్స్ అరికట్టాల్సిన ప్రజాప్రతినిధులే విచారణ ఎదుర్కోవడం సిగ్గుచేటు

**– సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ధ్వజం**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** డ్రగ్స్ ను అరికట్టాల్సిన, అడ్డుకోవలసిన ప్రజాప్రతినిధులే ఆ డ్రగ్స్ పార్టీలకు వెళ్లడం, పట్టుబడడం, విచారణను ఎదుర్కోవడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి ప్రకటనలో విమర్శించారు. హైదరాబాద్ శివారులోని ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీ నిర్వహిస్తూ పట్టుబడిన వారిలో ఏలూరు జిల్లా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఉన్నట్లు,పట్టుబడినట్లు,విచారణ ఎదుర్కొంటు న్నట్లు పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు. గతంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకి కేంద్రబిందువుగా వార్తలకు ఎక్కిన తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ లోనే శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తుందన్నారు.అక్కడ జరిగిన డ్రగ్స్ పార్టీలో జిల్లా ఎంపీ మహేష్ కుమార్ జైపూర్ మాజీ ఎమ్మెల్యే నితీష్ శర్మను తీసుకువచ్చినట్లు,ఈ సందర్భంగానే ఆయన పోలీసులకు పట్టుబడినట్లు, విచారణ ఎదుర్కొంటున్నట్లు వార్తల రావడం చాలా హీనకరమైన విష యం అన్నారు.కంచె చేను మేసినట్లుగా డ్రగ్స్‌ను అరికట్టాల్సిన ప్రజా ప్రతినిధులే ఆ డ్రగ్స్ సేవిస్తూ, పోలీసులకు పట్టు పడడం బాధాకం మన్నారు. ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసి,వారి ఆర్థిక పరిస్థితులను విచ్ఛిన్నం చేసి,వారి కుటుంబాలను నాశనం చేస్తున్న డ్రగ్స్‌ను సేవిస్తున్న ప్రజాప్రతినిధులు ప్రజలకు నీతి సూత్రాలు ఏ విధంగా చెబుతారని ఆయన ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో యువకుడు,కళాకారుడైన పెంచలయ్య అక్కడి డ్రగ్స్ మాఫియాకి వ్యతిరేకంగా ప్రజల తరపున పోరాడినందుకు హత్య చేసిన సంఘటనను ఆయన గుర్తు చేశారు. ఈ ఘటనలో ఉన్నది ఎవరైనా సరే,ఎంతటి వారైనా సరే, తన–మన బేధం విడిచి విచారణ చేపట్టాలని, నిందితులను గుర్తించాలని,దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. తద్వారా డ్రగ్స్ అమ్మకాలను అడ్డుకట్ట వేయాలని, డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడి పనిచేయాలని కోరారు.

# గ్యాస్ సరఫరాపై ఆందోళన వద్దు

**మొదటిపేజి తరువాయి**

సరఫరా అవుతున్నాయని జేసీ తెలిపారు. వినియోగదారుల అవసరాలకు తగినట్లుగా పంపిణీ ప్రక్రియ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

**పెండింగ్ బుకింగ్స్.. 4 రోజుల్లో పూర్తి**

జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 75,862 మంది వినియోగదారులు రీఫిల్ బుకింగ్ చేసుకోగా, ఇప్పటికే 14,392 సిలిండర్ల డెలివరీ పూర్తయిందని జేసీ వివరించారు.

- **మొత్తం బుకింగ్స్: 75,862**
- **పూర్తయిన డెలివరీలు: 14,392**
- **పెండింగ్‌లో ఉన్నవి: 61,470**

పెండింగ్‌లో ఉన్న బుకింగ్స్‌ను రాబోయే 3నుండి4రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. డెలివరీలన్నీ అంటే మొదట బుక్ చేసుకున్న వారికి ప్రాధాన్యత క్రమంలో అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయిల్ కంపెనీల వద్ద 16,150 సిలిండర్ల స్టాక్ అందుబాటులో ఉందని చెప్పారు.

**అప్రమత్తంగా ఉండండి.. డిజిటల్ బుకింగ్ వాడండి:**"ప్రజలు అనవసరంగా భయాందోళనలకు గురై అవసరానికి మించి బుకింగ్స్ చేయవద్దు. ఒకేసారి పెద్ద సంఖ్యలో కాల్స్ చేయడం వల్ల ఇబ్బందులు ఎదురైతే.. వాట్సాప్, మిస్డ్ కాల్ లేదా ఫోన్‌పే,గూగుల్ పే,వంటి యాప్‌ల ద్వారా సులభంగా బుకింగ్ చేసుకోవచ్చు." – అపూర్వ భరత్, జాయింట్ కలెక్టర్.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు..**వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేకంగా 8886903611 హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు జేసీ తెలిపారు. జిల్లా పౌర సరఫరా అధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజును ఆదేశించి, ప్రతి గ్యాస్ ఏజెన్సీతో సమన్వయం చేసుకుంటూ అదనపు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు.

## నేటి నుండే ఉన్నత చదువులకు తొలిమెట్టైన పదో తరగతి పరీక్షలు ప్రారంభం

**మొదటిపేజి తరువాయి**

చదివేటప్పుడు ముఖ్యాంశాలను ఒక దగ్గర రాసుకోవడం వల్ల రివిజన్ సమయంలో సులభంగా ఉంటుందన్నారు పరీక్షల సమయంలో రాత్రంతా మేల్కొని చదవడం కంటే,కనీసం6 గంటలు నిద్ర అవసరమని, దీనివల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందన్నారు.జంక్ ఫుడ్ మానేసి, పండ్లు, ఆకు కూరలు మరియు తగినంతనీరు తీసుకోవాలన్నారు. నేను బాగారాయగలననే ఆత్మవిశ్వాసాన్ని పెంచుకొని, ఫలితంగురించి ఆలోచించకుండా కేవలం చదవడంపైనే దృష్టి పెట్టాలన్నారు. నిరంతరాయంగా గంటల తరబడి చదవకుండా, మధ్య మధ్యలో విరామం తీసుకోవాలన్నారు. గత కొన్ని సంవత్సరాల ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం వల్ల పరీక్షా విధానంపై అవగాహనపెరిగి మరియు సమయపాలన అలవడుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై అతిగా ఒత్తిడి తీసుకురావద్దన్నారు.వారిని ఇతర విద్యార్థులతో పోల్చకుండా, వారికి ధైర్యాన్ని నింపాలన్నారు. ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలని, పరీక్షలు మేధస్సుకు ఒక పరీక్ష మాత్రమేనని ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు అనగానే భయపడాల్సిన అవసరం లేదని, ఇది మీ విజ్ఞానాన్ని ప్రదర్శించే ఒక చక్కని అవకాశం మాత్రమేనన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు పరీక్షలు పునాది రాళ్లు వంటివని, పరీక్షలను ఒక సవాలుగా స్వీకరించి, ఆత్మ విశ్వాసంతో ఎదుర్కోవాలని ఆయన విద్యార్థులను ఆశీర్వదించారు. పరీక్షా పేపర్ చూడగానే కంగారు పడకుండా, ప్రశాంతంగా చదివి తెలిసిన సమాధానాలను ముందుగా స్పష్టంగా రాయాలన్నారు. క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్ కలిగి సమయాన్ని వృథా చేయకుండా, ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. ముఖ్యమైన అంశాలను పదే పదే రివిజన్ చేయాలన్నారు. విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులుగా పట్టుదల, కష్టపడే తత్వంతో కోనసీమ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టాలన్నారు. పట్టుదల ఉంటే విజయం మీ సొంతమవుతుందన్నారు. పరీక్షలు రాసే ప్రతి విద్యార్థికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు ధైర్యంగా పరీక్షలు రాయండి, మన జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో మారుమోగేలా చేయాలంటూ ఆల్ ది బెస్ట్ అన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి అంకురార్పణ

**మొదటిపేజి తరువాయి**

గ్రామంలోని మత్స్యకారుల సౌకర్యార్థం రూ.1 లక్ష వ్యయంతో నిర్మించిన మార్కెట్ షెడ్డును వాసంశెట్టి సత్యం, నాయకులుతో కలిసి ప్రారంభించారు. దీని ద్వారా మత్స్యకారులు తమ చేపలను విక్రయించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

**ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద సిమెంట్ బెంచ్‌ల ప్రారంభం**

అలాగే ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఎదురుగా రూ.60 వేల వ్యయంతో నిర్మించిన సిమెంట్ బెంచ్‌లను ప్రారంభించారు. ప్రజలకు విశ్రాంతి కోసం ఈ సదుపాయం ఉపయోగ పడుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా కూళ్ల గ్రామ అభివృద్ధి కోసం చిట్టూరి రామ్మోహన్రావు చేస్తున్న సేవలను వాసంశెట్టి సత్యం, చిట్టూరి రవీంద్ర, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, టిడిపి గ్రామ అధ్యక్షులు చిట్టూరి సుబ్బారావు, డామినేని శ్రీనివాస్, కనకాల సుబ్బరాజు, గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంఘ మత పెద్దలతో బాల్య వివాహ నిరోధంపై అవగాహన

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు మినీ బైపాస్ విజయ గార్డెన్స్ రోడ్ నెంబర్ 2లో హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘ కల్యాణ మండపం లో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ( క్రాఫ్) చైల్డ్ మ్యారేజ్ జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్ వినోద్ కుమార్ ,జిల్లా బాలల సంరక్షణ విభాగ అధికారిణి, డాక్టర్ సి.హెచ్ సూర్య చక్రవేణి సంయుక్త ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘ మత పెద్దలతో బాల్య వివాహ నిరోధంపై అవగాహన కార్యక్రమం జరిగింది. బాల్య వివాహం చట్టరీత్య నేరం. మన నగరంలో ఎవరైనా బాల్య వివాహానికి ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవు. బాల్య వివాహం జరుగుతుందని తెలిసిన యెడల చైల్డ్ హెల్ప్ లైన్ 1098,100,112 కి, వార్డ్ కార్పొరేటర్, వార్డ్ సెక్రెటరీ, వార్డ్ మహిళా సంరక్షణ అధికారి, బాల్య వివాహ నిరోధిక అధికారులకు సమాచారాన్ని అందించాలని కోరారు.

# రామకృష్ణ మిషన్ ప్రత్యేక వైద్య శిబిరం





**- 500 మందికి వైద్య సేవలు**

**- రోగులకు అన్నదానం**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడు రామకృష్ణ మిషన్ వైద్యశాల వద్ద ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ ఆధ్వర్యంలో ఈ మెడికల్ క్యాంప్ జరిగింది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కస్తూరి సుబ్రమణ్యం, డాక్టర్ పోతుల రామారావు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ శ్రీకృష్ణ పాతూరి, డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ ఉమా మహేష్, డాక్టర్ రాజేష్ ఖన్నా, జి.యస్.ఎల్. జనరల్ ఆసుపత్రి అండ్ మెడికల్ కాలేజీ, రాజానగరం నుండి వైద్య నిపుణులు పాల్గొని సుమారు 500 మందికి వైద్యసేవలు అందించారు. వారిలో అవసరమైన 106 మందికి రక్త, నీరుడు పరీక్షలు, 15మందికి ఇ.సి.జి. లు, 6గురికి థైరాయిడ్ పరీక్షలు, 10 మందికి ఎక్స్ రే లు, 6గురికి ఫిజియథెరపీ చేసినట్లు స్వామిజీ తెలియజేసారు. కాగా వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 42 మందికి కళ్ళజోళ్ళు అందజేశారు.

13 మందిని కంటి ఆపరేషన్లు నిమిత్తం వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయంకు తరలించారు. ఈ వైద్య శిబిరంలో పరమహంస యోగానంద నేత్రాలయం ప్రోగ్రామ్ మేనేజర్ నక్కా చంటి బాబు, వలంటీర్లు ఉదయ్ భాస్కర్, వాసు రాజు, సత్య ప్రసాద్, వై.వి.సత్యనారాయణ, మంగిరెడ్డి, భగీరథ రాజు, రామకృష్ణ మిషన్ వైద్య సేవల సమన్వయ కర్త కానుమోను శ్రీనివాస్, రామకృష్ణ మిషన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామిజీ తెలిపారు.

## వినియోగదారుల హక్కుల అవగాహన కార్యక్రమంలో ఆదిత్య విద్యార్థినులు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు ఆదివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచడానికి అవగాహన కార్యక్రమం నిర్వహించారని ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు.

ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను పరిరక్షించడం ప్రతి ప్రభుత్వానికి మరియు వ్యాపార సంస్థలకు ముఖ్యమైన భాధ్యత అని, ఇదే విషయంగా మహిళా డిగ్రీ కళాశాల వాలంటీర్లు వినియోగదారులకు అవగాహన కల్పించే భాధ్యతను చేపట్టినట్లు ఆయన వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ వినియోగదారులకు ప్రధానంగా భద్రత హక్కు, సమాచారం పొందే హక్కు, ఎంపిక హక్కు, పరిహారం పొందే హక్కు మరియు వినియోగదారుల విద్య హక్కు వంటి హక్కులు ఉన్నాయని తెలిపారు. వినియోగదారులు కొనుగోలు చేసే సమయంలో బిల్లు తీసుకోవడం, తయారీ తేదీ, గడువు తేదీ, ధర వంటి వివరాలు తెలుసుకోవడం అవసరం అని అభిప్రాయపడ్డారు. కళాశాల వైస్




ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ వినియోగదారులకు ఏవైనా సమస్య ఎదురైతే వినియోగదారుల ఫోరమ్‌లో ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల జాతీయ సేవా పథకం కార్యనిర్వహనాధికారి పి.సురేఖా దేవి మరియు వాలంటీర్లు డైరీఫారమ్,సంజీవ్‌నగర్, సాంబమూర్తినగర్ పరిసర ప్రాంత వినియోగదారులకు హక్కులను వివరించే కార్యక్రమం మరియు అవగాహన ర్యాలీ నిర్వహించి వినియోగదారులకు అవగాహన కల్పించారు.

# వెంకన్న నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్య అన్నదాన పథకానికి ఆదివారం వీరవాసరం మండలం మత్స్యపురికి చెందిన జవ్వాది సూర్యనారాయణ మూర్తి, చి. ప్రణవి రామ హృద్య మరియు వారి కుటుంబ సభ్యులు రూ. 1,01,116లు విరాళంగా అందించారు.

వీరికి అర్చకులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు లు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.



# పేదల సేవే అల్లాకు ప్రీతి - సాదిక్



కాకినాడ, మేజర్‌న్యూస్ : తనకున్నంతలో పేదలకు సేవా కార్యక్రమాల ద్వారా సహాయం చేయడం అల్లాకు ప్రీతికరమని అమరావతి డిఐజి కార్యాలయ పోలీస్ అధికారి సాదిక్ అన్నారు. ఆశ్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ మాస సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక విముక్తి కాలనీలో నివాసముంటున్న వారికి స్త్రీ పురుషులకు సుమారు 30 వేల రూపాయలు విలువచేసే నూతన వస్త్రాలను పంపిణీ చేసే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సాదిక్ చేతుల మీదుగా మిత్ర బృందం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్ర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అలీమ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. పండుగ సందర్భంగా నిర్వహించుకునే వేడుకలు పేదలతో కలిసి చేసుకుని వాడే భగవంతుడు హర్షిస్తారని చెప్పారు. అలీమ్ మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమానికి అవసరమైన నూతన వస్త్రాలను విజయవాడ నుండి తెప్పించడం జరిగిందని అందుకు సాదిక్ సహాయ సహకారాలు అందించినందుకు ధన్యవాదాలు తెలుపుకున్నారు. మధ్యాహ్నం వీరందరికీ మంచి విందు భోజనాన్ని హజార్ సమకూర్చాలని చెప్పారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సునంద మాట్లాడుతూ అలీమ్ అనేక కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సేవా కార్యక్రమాలను అందిస్తున్నారని ప్రశంసించారు. విద్య వైద్య ఇతర రంగాలలో కూడా ఆర్థిక సహకారం అందిస్తూ వారందరి అభివృద్ధిని కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సయ్యద్ హుస్సేన్, అలీ మహమ్మద్, సందాని, డాక్టర్ బాబు, బదిరుద్దీన్ మొహిద్దిన్ వలి, వెంకటేష్, భాష లు పాల్గొన్నారు.

## గాంధీనగర్ శాఖా గ్రంధాలయంలో 'సండే స్టోరీ టైం' కార్యక్రమం



కాకినాడ, మేజర్ న్యూస్ : తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ వివేకానంద పార్కు ఓలో గల గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో ఆదివారం నాడు లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'సండే స్టోరీ టైం' చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పాఠశాల విద్యార్థినీవిద్యార్థుల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించుటకు గత 150 వారాలుగా ప్రతి ఆదివారం గాంధీనగర్ శాఖా గ్రంధాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించడం జరుగుచున్నది.

ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో ప్రపంచ అద్భుత నీతి కథలు, డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్, విజ్ఞాన తరంగాలు తదితర పుస్తకములను చదివించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయంలో గల కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యాలనువినియోగించుకోవలసిందిగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ఘనంగా కాన్షిరాం జయంతి





- రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజనులు పాటుపడాలి
- బి.ఎస్.పి. సెంట్రల్ కోఆర్డినేటర్ సురేష్ ఆర్య పిలుపు

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షిరాం 92వ జయంతి రావులపాలెం ఇందిరాకాలనీ అంబెద్కర్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ జోన్-2 పరిధిలోని డా. బి.ఆర్.అంబెద్కర్ కోనసీమ,కాకినాడ,తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలు ఉమ్మడిగా నిర్వహించిన ఈ జయంతి కార్యక్రమానికి జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షులు బి.జాన్ మోసే అధ్యక్షత వహించగా ఉత్తర ప్రదేశ్ నుండి సెంట్రల్ కోఆర్డినేటర్ సురేష్ ఆర్య, రాష్ట్ర అధ్యక్షులు బి.గౌతమ్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసారు. ఈ జయంతోత్సవంలో ముఖ్య అతిథులు సురేష్ ఆర్య మాట్లాడుతూ డా. అంబెద్కర్ ఆశయాలు నెరవేర్చడానికి కాన్షిరాం తన జీవితాన్ని త్యాగం చేసారని, తన ప్రజలను పాలకులుగా చూడాలని కోరుకున్న అంబెద్కర్ ఆశయాన్ని ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా చేసి నిరూపించారని, ఆయన అంబెద్కర్ నిజమైన వారసుడని కొనియాడారు. అలాగే మరొక అతిథి రాష్ట్ర అధ్యక్షులు బి.గౌతమ్ కుమార్ మన రాష్ట్రంలో కూడా బహుజన్ సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. మన రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్ స్థానంలో ఉన్న రఘురామకృష్ణంరాజు బాబాసాహెబ్ అంబెద్కర్‌ను తన నియోజకవర్గంలో ఫ్లెక్సీ చింపి అవమానించడం ఎంతో ఆందోళన కలిగించిందని అన్నారు.ఇలాంటి సంఘటనలు ఆపాలంటే అంబెద్కర్ కోరుకున్న అధికారం వైపు పయనించాలని అన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కోఆర్డినేటర్ జి.సంపదరావ్, రాష్ట్ర కార్యదర్శులు జి.చిత్రసేన్, కె.సత్యం, ఇ.అశోక్, ఎం.రత్నరాజు, బి.లక్ష్మణరావు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు పి.విజయ్, కాకినాడ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బుబాయ్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఇ.ఎలియరాజు, ఏలూరు జిల్లా అధ్యక్షులు యస్.భరత్ డా. బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా ఇంచార్జులు కుసుమ వెంకటేశ్వరరావు, వాకపల్లి భీమారావ్, ఉపాధ్యక్షులు జిత్తుక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, ఊదుమూడి ఎం.పి.టి.సి ప్రియదర్శిని, కార్యదర్శి కోణాల ప్రకాష్, ట్రెజరర్ కాండ్రేగుల గంగరాజు, కొత్తపేట అధ్యక్షులు మరియు ఇంచార్జ్ గుర్రపు కొత్తియ్య, వివిధ నియోజకవర్గాల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం

**చింతూరు, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మద్దిగూడెంలో ఆదివారం రోజు స్థానిక సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ రితీష్ ఠాగూర్, ఆదేశాలు మేరకు డి-141 బెటాలియన్ ఇన్స్పెక్టర్ ఎన్.మోహన్ రావు, ద్వారా ఉచిత సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో గ్రామీణ గిరిజన మహిళలకు ఫినాయిల్, వాషింగ్ పౌడర్, కొవ్వొత్తులు, అగరవత్తులు, ఎలా తయారు చేయటం అనేది ప్రముఖ నిపుణులు విశాఖపట్నం శంకర్ ద్వారా నేర్పించడం జరిగింది. దీనివలన మహిళలు స్వయంగా తయారు చేసుకుని ఆర్థిక అభివృద్ధి చెందుతారని చెప్పడం జరిగింది, ఈ కార్యక్రమంలో గిరిజన మహిళలందరికీ తయారు చేసుకునేందుకు సామాగ్రి కూడా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో చింతూరు సిఐ, ఎస్ఐ, సిఆర్పిఎఫ్ సిబ్బంది, గ్రామ పెద్దలు, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



# టీచర్లకు ఘనంగా సన్మానం



అల్లవరం, మేజర్ న్యూస్ : అల్లవరం మండలం గోడితిప్ప గ్రామంలో స్కూల్ ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు, విద్యార్థులు అందరూ కలిసి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బదిలీపై వేరే స్కూళ్లకు వెళ్లిన టీచర్లకు ఘనంగా సన్మానం చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సూర్యచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ చిట్టినీడి శ్రీదేవి శ్రీనివాసరావు హాజరైనారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన ముత్యాల నరసింహారావు, మోసుగంటి లక్ష్మీప్రసన్న, సాల్మన్ రాజు ఈ పాఠశాలకు అభివృద్ధికి కృషి చేస్తానని, విద్యార్థులకు చక్కగా బోధించారని మరల అవకాశం ఉంటే ఈ పాఠశాలకు వచ్చి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని తెలియజేశారు.

పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కొల్లు వేణుగోపాల్ మాట్లాడుతూ గతంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన ముత్యాల నరసింహారావు గురించి, అతను చేసిన అభివృద్ధి పనుల గురించి కొనియాడారు. అలాగే పాఠశాలలో పనిచేసిన మోసుగంటి లక్ష్మీప్రసన్న గురించి ఆమె విద్యార్థులకు విద్య నేర్పిన విధానం గురించి కొనియాడారు. అలాగే ఈ పాఠశాలలో పనిచేసిన ఎంటిఎస్ టీచర్ టి.సాల్మన్ రాజు గురించి అతని చేసిన సేవ గురించి కొనియాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఈ పాఠశాలలో పనిచేసినప్పుడు ఎస్ఎంసి చైర్మన్, విద్యార్థులు తల్లిదండ్రులు చక్కగా సహకరించారని, మరల అవకాశం ఉంటే ఈ స్కూల్ కోరుకుని మరల సేవలందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.సత్యనారాయణ, బసవా శేషాంబ, చిట్టినీడి శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ లక్ష్యం



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** స్త్రీ శక్తి పథకం అమలు అనంతరం పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణికులు సంఖ్య అధికం కావడంతో వారి యొక్క భద్రతను దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాస్ రావులపాలెం డిపో పల్లె వెలుగు బస్సులను పరిశీలించారు. ప్రయాణికుల భద్రతా ప్రమాణాలు దృష్టిలో పెట్టుకుని మెట్లు వద్ద సపోర్టు రాడ్లను ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్ వారికి సూచించారు. జిల్లా రవాణా అధికారి యొక్క సూచనలు మేరకు మొదట విడతగా వాడపల్లి రావులపాలెం తిరిగే ఒక పల్లె వెలుగు బస్సుకు సపోర్టు రాడ్లను ఏర్పాటు చేశామని, త్వరలోనే రావులపాలెం డిపోలో ఉన్న పల్లె వెలుగు బస్సులు అన్నిటికీ కూడా ఈ విధంగా ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్.కుమార్ తెలియజేశారు. వీరి వెంట స్టేషన్ మేనేజర్ ఎం.గురవయ్య నాయుడు తదితరులు ఉన్నారు.

# గొల్లప్రోలు జాతీయ రహదారిపై కారు బోల్తా



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు శివారు చెందుర్తి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. అధిక వేగంతో ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. కారు తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, అందులోని ప్రయాణికులు అదృష్టవశాత్తూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన స్థానికులు కారులో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసి వారికి అవసరమైన సహాయం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అతివేగం వల్లే కారు నియంత్రణ కోల్పోయి ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# ఉచిత విద్యా పథకానికి తూట్లు

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఏ విద్యార్థి కూడా ప్రాథమిక దశలో ప్రాథమిక విద్యను పూర్తి చేయడానికి అడ్డంకిగా ఏదీ మారకూడదు అని సదుద్దేశంతో 2009 విద్య హక్కు చట్టం సెక్షన్ 3 (2) ప్రకారం కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు పేదలకు కేటాయించాలని హైకోర్టు పిలుపుమేరకు ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి ఈ పథకానికి ప్రభుత్వమే తూట్లు పొడుస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. విద్య హక్కు చట్ట ప్రకారం ప్రాథమిక విద్యలో కార్పొరేట్ పాఠశాలలో ప్రభుత్వం నిబంధనల మేరకు సీటు పొందిన ప్రతి విద్యార్థికి ఆయా పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు పూర్తిగా ఉచితంగా అందజేయాలి వాటిలో పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ లైబ్రరీ రాత సామాగ్రి వంటి అన్ని సౌకర్యాలు ఉచితంగానే ఆయా పాఠశాలల అందించాలి.

కానీ వాస్తవంగా సీట్ పొందిన ప్రతి విద్యార్థి ఆయా పాఠశాలలకు ప్రభుత్వ అధికారులే ఒక్కొక్క సీటుకు రూ.6500 చెల్లించాలని నిబంధనలు పెట్టారు. అంతేకాకుండా ఏ పాఠశాల అయినా కేవలం చదువు మాత్రమే చెబుతారు తప్ప పాఠ్యపుస్తకాలు గానీ యూనిఫామ్ గానీ ఏది కూడా ఉచితంగా అందజేయరు. అంతేకాకుండా పరీక్షలు దగ్గర పడడంతో ఆయా పాఠశాలలో ఉచిత సీట్లు సాధించిన విద్యార్థులకు అమ్మ ఒడి ద్వారా లబ్ధి పొందిన సొమ్ములో రూ.11,500లు చెల్లించాలని అధికారులు తమకు తమకు ఆదేశాలు జారీ చేశారని, చెల్లించని పక్షంలో వారికి హాల్ టికెట్ నిరాకరించే పరిస్థితి నెలకొని ఉందని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోయారు. కేవలం ఉచిత సీట్లు ద్వారానే సుమారు 15,000 నుండి 20,000 వరకు ఫీజు చెల్లించే స్తోమత ఉంటే ఇంకా ఈ ఉచిత సీట్లు ఎందుకని పేరుకు మాత్రమే ఉచితమని ఫీజులు రూపేనాలో గవర్నమెంట్ చెల్లించమంటే తమ గోడు ఎవరితో చెప్పుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు లేబదిభో మంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఉచిత సీట్లు పొందిన విద్యార్థుల నుండి ఆయా పాఠశాల యజమానులు ఫీజులు వసూలు చేయకుండా ఉండేటట్లు చర్యలు చేపట్టాలని వారు కోరుకుంటున్నారు.

# రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ కార్యాలయం ప్రారంభం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంలో రాష్ట్ర ఎస్టీ కమీషన్ కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయం ప్రారంభోత్సవం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆదివారం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో చైర్మన్ బొజ్జి రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పోలవరం జిల్లాలో ఎస్టీ కమీషన్ కార్యాలయం ఏర్పాటు చేయడం వలన గిరిజనులకు మరింత వేగంగా సేవలు అందించడానికి ఎంతో ఉపయోగపడుతుందని చైర్మన్ బొజ్జి రెడ్డి తెలిపారు. అలాగే కార్యాలయం ప్రారంభమైన రోజే గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యాలయం ఏర్పాటు కావడం వలన జిల్లా గిరిజనులకు ప్రత్యేక సహాయం అందేలా అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం చైర్మన్ బొజ్జిరెడ్డి అడ్డతీగల, గంగవరం ప్రాంతాల్లో నూతన వధూవరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తిరిగి నివాసానికి చేరుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి

రంపచోడవరంలోని తన నివాసంలో గిరిజన ప్రజలు నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అడ్డతీగల మండలం గురగొమ్మి గ్రామ ప్రజలు భూ సమస్యపై చైర్మన్ దరఖాస్తు అందజేశారు. మారేడుమిల్లి మండలం చట్లవాడ గ్రామ ప్రజలు గిరిజన ప్రాంతాలలో చట్టాలకు వ్యతిరేకంగా వడ్డీ వ్యాపారం జరుగుతోందని తెలిపారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల గిరిజనులపై అధిక వడ్డీతో అప్పులు ఇచ్చి, వారి కుటుంబాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ విషయమై జరిగిన అన్యాయాన్ని అర్జీ రూపంలో చైర్మన్‌కు తెలియజేశారు. దేవీపట్నం మండలంలో పెద్దూరు, తున్నూరు పంచాయతీలకు సమీపంలో కచ్చులూరు ప్రక్కన కొత్తపల్లి లో సుమారు 1.25 ఎకరాల భూమి ముంపుకు గురవుతోందని గ్రామస్తులు తెలిపారు. భూమికి సర్వే నిర్వహించి నష్టపరిహారం ఇవ్వాలని చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. గంగవరం మండలం బయ్యనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 1/70 చట్టాన్ని ఉల్లంఘించి గిరిజన భూములను గిరిజనేతరులు అక్రమంగా ఆక్రమించుకున్నారని గ్రామస్తులు తెలిపారు. 1/70 చట్టం, ఇతర జి.ఓలను పరిగణనలోకి తీసుకొని గిరిజనులకు న్యాయం చేయాలని చైర్మన్‌ను కోరారు.

ఈ సందర్భంగా చైర్మన్ అందిన దరఖాస్తులను పరిశీలించారు. ఎక్కువగా వచ్చిన అర్జీలు భూ సమస్యలకు సంబంధించినవిగా గుర్తించారు. గిరిజన ప్రాంతాలలో భూముల అక్రమ ఆక్రమణలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. భూమి సంబంధిత అధికారులు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఆరు మండలాల నుండి భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు వచ్చినట్లు గుర్తించామని, అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి తెలిపారు.

# ఆయిల్ పామ్ గెలల నాణ్యత ప్రమాణాలపై అవగాహనా సదస్సు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట గ్రామంలో వెంకటా ప్రగడ శ్రీరామ్ మూర్తి పామాయిల్ తోటలో, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ గెలల కోత, నాణ్యత ప్రమాణాలు పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా పతంజలి ఫుడ్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డి. జి. మ్ ) ఎ.యస్ ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల్లో గెలలను కోసేటప్పుడు నాణ్యత ప్రమాణాలను దృష్టిలో పెట్టుకుని పక్వానికి వచ్చిన గెలలను మాత్రమే కోయాలని, దానివల్ల గెలల బరువు, అధిక ఆదాయాన్ని రైతులు పొందుతారని,అలాగే దీనికి గెలలు కోసేవారు, రైతులు సహకరించాలని, గెలలు కోసేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, హార్వెరస్టర్స్ చిన్నపాటి సమస్యలను తెలుసుకొని కంపెనీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అదేవిధంగా నాణ్యతమైన పక్వానికి వచ్చిన గెలలను ఎలా కోయాలో అందరి సమక్షంలో అవగాహనా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో గెలలు కోసేవారు కంపెనీ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ గ్యాస్ పంపిణీ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్

**– ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఎల్పీజీ గ్యాస్ పంపిణీపై నిరంతర పర్యవేక్షణకు రంపచోడవరం పౌర సరఫరాల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు పోలవరం ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు. ఎల్పిజీ వినియోగదారులు ఎవరు ఆందో ళన చెందవద్దని, వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా జిల్లాలో ఎల్పిజీ నిల్వలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇరాన్–ఇజ్రాయిల్ దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు కారణంగా గ్యాస్ నిల్వలు తగ్గి, ధరలు పెరుగుతాయని జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. జిల్లాలో వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా ఎల్పిజీ నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని జేసి పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. గ్యాస్ నిల్వలు, పంపిణీ వ్యవస్థపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతున్నదన్నారు. జిల్లా పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసి సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కేజిబివీలు, వైద్య ఆరోగ్యశాఖ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సాధారణ వినియోగదారులకు గ్యాస్ సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్యాస్ సరఫరా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడానికి రంపచోడవరం పౌర సరఫరాల కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డొమెస్టిక్ గ్యాస్ (14.2 కేజి) కు సంబంధించిన వివరాలకు 08864-243253 నంబర్‌లో సంప్రదిం చవచ్చునన్నారు. కమర్షియల్ వినియోగదారులు ఆయిల్ కంపెనీల అధికారిక వెబ్సైట్లోని హెల్ప్ డెస్క్ ద్వారా తమ అవసరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. వినియోగదారులు గ్యాస్ రీఫిల్ బిల్లు ధర మాత్రమే చెల్లించాలని, డెలివరీ సిబ్బందికి అదనపు రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎవరైనా అధికంగా డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు. చేయాలని సూచించారు. పోలవరం జిల్లాలో రోజు సుమారు 900 వరకు గ్యాస్ సిలిండర్ల వినియోగం ఉంటుందని అంచనా వేసి, ప్రస్తుతం 2,356 వరకు గ్యాస్ సిలిండర్ల అందుబాటులో ఉన్నాయని, డిమాండ్ మేరకు రీఫిల్స్ అందుబాటులో ఉండేలా గ్యాస్ ఏజెన్సీలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ మండలంలో గ్యాస్ విని యోగం తనిఖీ కొరకు రెవెన్యూ, పోలీస్ సిబ్బందిలో టీం ఏర్పాటు చేసి నట్టు తెలిపారు. ప్రభుత్వ రాయితీతో ఇచ్చే డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ఇలా అక్రమంగా వినియోగించే వారిపై నిత్యావసర సరుకుల చట్టం 1955 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించే వ్యక్తులు, సంస్థలు, ఏజెన్సీలపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారి విజయ బాస్కర్, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శివాలయం, విష్ణాలయం నిర్మాణానికి విరాళాలు





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** ఆత్రేయపురం గ్రామంలో వేంచేసి యున్న బాలా త్రిపుర సుందరి రాజరాజేశ్వరి, వేణుగోపాలస్వామి ఆలయ పునర్మాణానికి ఆదివారం ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి సూర్యనారాయణ రాజు, కమలమ్మ దంపతులు రూ.లక్ష; దండు సత్యనారాయణరాజు, అనంత సత్య లక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రాంబద్ర రాజు, ఆలయ చైర్మన్లు వేగేశ్న ప్రసాదరాజు, పులవర్తి కాశి లకు అందించారు.

## ఘనంగా స్వామివార్ల మాస కళ్యాణం






**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి, ఆత్రేయపురం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామివారి ఆలయాలలో ఆదివారం శ్రవణ నక్షత్ర సందర్భంగా మాస కళ్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కంకణ ధారణ, మధుపర్కప్రాశన, వరపూజ, పాదో ప్రక్షాళన, కన్యాదానం, సూత్రధారణ, యజ్ఞోపవేత ధారణ, తలంబ్రాలు క్రతువును పండితులు రమణీయంగా జరిపించారు. ఈ సందర్భంగా ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో భాగవతుల వెంకటరమణ మూర్తి లు శ్రీ స్వామివారికి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు; అలాగే ఆత్రేయపురం లక్ష్మి వెంకటేశ్వర స్వామివారికి పట్టు వస్త్రాలను చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణ రాజు, రాజ్యలక్ష్మి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ మేనేజర్ గోరింట వినయ్ కుమార్ రాజు పర్యవేక్షించారు.

## గొల్లప్రోలులో ఉల్లాసంగా 'ఉల్లాస్ అక్షరాస్యత' పరీక్షలు

**– 12,612 మంది అభ్యర్థుల హాజరు**



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు మండలంలో అక్షరాస్యత శాతాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉల్లాస్ అక్షరాంధ్ర' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రాథమిక అక్షరాస్యత పరీక్షలకు విశేష స్పందన లభించిందని ఎంపీడీవో సెలెట్ రాజు అన్నారు.

అభ్యర్థుల సౌకర్యార్థం మండలం పరిధిలోని నాలుగు ప్రధాన పరీక్ష కేంద్రాలు చేబ్రోలు, వన్నెపూడి, తాటిపర్తి, మరియు దుర్గాడలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్.ఆర్.జి.ఎస్ నుండి 4,676 మంది, వెలుగు పథకం ద్వారా 7,936 మంది మొత్తం 12,612 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. నిరక్షరాస్యతను నిర్మూలించి, ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక గొప్ప ముందడుగు అని పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా ముగిశాయని ఆయన తెలిపారు.

# ముస్లిం సోదరులకు అండగా ఉంటాం

**– మాజీ ఎమ్మెల్యే వర్మ**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ముస్లిం సోదరుల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని, వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. పిఠాపురం పట్టణం 24వ వార్డులో మస్తాన్ నవాబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రంజాన్ ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా తనను ఆహ్వానించి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన మస్తాన్ నవాబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిరుపేదలకు బట్టల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముస్లిం సోదరులు మొదటి నుండి తమకు వెన్నంటి ఉంటూ సపోర్ట్ చేస్తున్నారని, వారి సమస్యల పరిష్కారంలో తాను ఎప్పుడూ ముందుంటానని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం టౌన్ అధ్యక్షులు బొజ్జా సతీష్, షేక్ యాసిన్, మొల్లి మరిడిరాజు, వియ్యపు రమణరాజు, మాజీ కోఆప్షన్ మెంబర్ భాషా, చెల్లూరు అశోక్, సోము సత్యనారాయణ, అల్లవరపు నగేష్, అడ్డూరి శ్రీను, సురవరపు సుబ్బారావు, రావుల రమేష్, అందుగుల సత్తిబాబు మరియు ఇతర పార్టీ కార్యకర్తలు, స్థానిక ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు సర్వం సిద్ధం

**అనపర్తి, మేజర్ న్యూస్ :** నేడు ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అనపర్తి మండలంలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడమైందని, గవర్నమెంట్ స్కూల్స్ నుండి 566 మంది విద్యార్థులు, ప్రైవేట్ స్కూల్స్ నుండి 326 మంది విద్యార్థులు, ఇతర ప్రైవేట్‌గా 9 మంది విద్యార్థులు మొత్తం 901 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈఓ సత్తిరెడ్డి తెలిపారు. పరీక్షలు ఉదయం గం.9:30 లకు ప్రారంభమై మధ్యాహ్నం గం. 12:45 లకు ముగుస్తాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్ అనుమతించేది లేదని, నిర్దేశించిన టైం కి ఆలస్యంగా వస్తే అనుమతించేది లేదని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు సత్తిరెడ్డి అన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

**– పాల్గొన్న భక్తులు**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పిఠాపురం 'పాడా'లో పీజీఆర్ఎస్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం మార్చి 16వ తేదీ సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ పిడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్ద ఉన్న పాడా కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు జరుగుతుందని తెలియజేశారు. నియోజకవర్గ స్థాయిలోని అన్ని విభాగాల డివిజనల్ మరియు మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి విధిగా హాజరుకావాలని పీడీ ఆదేశించారు. నేరుగా రాలేని అర్జిదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం కల్పించిన వెబ్సైట్ ద్వారా కూడా తమ అర్జీలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చికిత్స పొందుతున్న చిన్నారి వైద్యం నిమిత్తం రూ.పది లక్షలు చెక్కు అందించిన ఎమ్మెల్యే శిరీష దేవి

**– ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం**
**– ఆపదలో ఉన్న వారికి కూటమి సర్కార్ భరోసా**




**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** వైద్య పరమైన ఆపదలో ఆర్థిక చేయుత అందించటంలో ముఖ్యమంత్రి సహాయనిధి చాలా ఉపయోగపడుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం వట్టిగడ్డ ఆమె క్యాంపు కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో అనారోగ్యం పాలైన చికిత్స పొందుతున్న కులం దశరత్నం చైల్డ్ కేరాఫ్ కరక ప్రేమ కిరణ్‌కి సీఎం సహాయ నిధి నుంచి రూ:10,00,000/– లు చెక్కును ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే పోలవరం జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి అనేకమంది అనార్తులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టీడీపీ బీసీ విభాగం నాయకులు ఎంపీటీసీ, కరక వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ 75+ టెన్నిస్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన పసల



**సామర్లకోట మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ 75ం టెన్నిస్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన పూర్వపు విద్యార్థి పసల పద్మ రాఘవరావు ను సత్కరించిన 75 వ సంవత్సరం టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఎండ్రు ప్రభాకర్ రావు, పాలకుర్తి ప్రసాద్, స్వయంవరపు వీరభద్రరావు, అడపా వెంకట్రావు, జి. రాజు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాలు పరిశీలించిన ప్రత్యేక అధికారి....





**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ అడ్డతీగల మండలంలో ఆదివారం జరిగిన అక్షరాంధ్ర లెర్నర్స్ ఫైనల్ పరీక్షల నిర్వహణ తీరును మండల ప్రత్యేక అధికారి మరియు ట్రైబల్ వెల్ఫేర్ డిడి రుక్మాం గదయ్య ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. మండల విద్యాశాఖ అధికారి రమేష్‌తో కలిసి మండలంలోని రాజానగరం గొండోలు పాపంపేట బీముడు పాకలు గ్రామాలతో పాటు అడ్డతీగలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అక్షరాంధ్ర పరికరం స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మూల్యాంకనం వచ్చిన మార్కులను అప్లోడ్ చేయడం వంటి అంశాలపై చర్చించారు. అనంతరం సోమవారం నుండి మండలంలో నిర్వహించే పదవ తరగతి పరీక్ష కేంద్రాలను కూడా సందర్శించి నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారికి సూచించారు.

## పది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన అడ్డతీగలలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న బాలికలకు తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు బీరా వెంకట్ లక్ష్మి ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రిని ఆదివారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలలో అవసరమయ్యే పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్, పరీక్ష అట్టలు అందరికీ అందజేశారు. వెంకటలక్ష్మి తన సొంత డబ్బులతో వీటిని సమకూర్చి విద్యార్థుల సౌకర్యార్థం అందించడం పట్ల పాఠశాల యాజమాన్యం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో తమ సత్తా చాటి ప్రైవేటు పాఠశాల విద్యార్థు లతో పోటీగా ఉత్తమ మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నడూ లేని అవకాశాలను కల్పిస్తు ందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులకు భారీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని సూచించారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిరంతరం

**- అవసరానికి మించి బుకింగ్లు చేయొద్దు**
**- కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లాలో గృహ అవసరాల వినియోగం కోసం, అలాగే విద్యార్థుల సంక్షేమ వసతి గృహాలు మరియు అత్యవసర సేవలకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు గ్యాస్ సిలిండర్లు గోకవరం, విశాఖపట్నం, విజయవాడలోని ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ల నుంచి ప్రతి రోజూ సాధారణ స్థాయిలో సరఫరా అవుతున్నాయని, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పంపిణీ జరుగుతోందని తెలిపారు. సాధారణ పరిస్థితుల్లో రోజుకు సుమారు 11,000 నుంచి 11,500 వరకు రీఫిల్ బుకింగ్లు నమోదవుతూ ఉంటాయని, అయితే ప్రస్తుతం రోజువారీగా 19,896 నుంచి 22,250 వరకు బుకింగ్లు నమోదవుతున్నాయని తెలిపారు. అంటే సాధారణ పరిస్థితులతో పోలిస్తే దాదాపు 90 నుంచి 95 శాతం వరకు పెరుగుదల నమోదైందన్నారు. సిలిండర్ల డెలివరీలు ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ విధానంలో కొనసాగుతున్నందున కొన్నిచోట్ల బుకింగ్ చేసిన తరువాత 2 నుంచి 3 రోజులలో డెలివరీలు జరుగుతున్నాయని, కొన్నిచోట్ల అంతరాయం కారణంగా 2 నుంచి 3 రోజుల వరకు ఆలస్యం కనిపిస్తున్నదని వివరించారు. అందువల్ల గ్యాస్ సరఫరా విషయంలో వినియోగదారులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. తప్పుడు సమాచారాన్ని నమ్మి అవసరానికి మించి బుకింగ్లు చేయకుండా, అవసరం మేరకే సిలిండర్లు బుక్ చేసుకోవాలని వినియోగదారులను కోరారు. గ్యాస్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కంట్రోల్ రూమ్లో హెల్ప్లైన్ నెంబర్ 8074661259 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే వినియోగదారులు ఈ సేవను వినియోగించు కోవచ్చని సూచించారు. ఒకేసారి అధిక సంఖ్యలో రీఫిల్ బుకింగ్లు చేయడం వల్ల కొన్నిసార్లు కాల్స్ కనెక్ట్ కాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఏజెన్సీ వారీగా శనివారం నమోదైన బుకింగ్స్, డెలివరీలు మరియు గత 72 గంటలకు పైగా పెండింగ్లో ఉన్న వివరాలను పరిశీలిస్తే, ... ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం 3,355 బుకింగ్స్ నమోదు కాగా 2,100 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 7,232 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్లో ఉన్న బుకింగ్స్ 1,544 ఉన్నాయి.

హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ పరిధిలో శనివారం 15,278 బుకింగ్స్ నమోదు కాగా 10,134 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 8,077 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్లో ఉన్న బుకింగ్స్ 18,306 ఉన్నాయి.

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (ధ్రూజ) పరిధిలో శనివారం 1,236 బుకింగ్స్ నమోదు కాగా 727 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం 1,138 సిలిండర్లు అందుబాటులో ఉండగా 72 గంటలకు పైగా పెండింగ్లో ఉన్న బుకింగ్స్ 2,394 ఉన్నాయి.

శనివారం రోజున మూడు ఆయిల్ కంపెనీల ద్వారా మొత్తం 19,869 బుకింగ్స్ నమోదు కాగా 12,961 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయి. ప్రస్తుతం మూడు సంస్థల వద్ద కలిపి 16,447 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 72 గంటలకు మించిన పెండింగ్ బుకింగ్స్ మొత్తం 22,244 ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్ బుకింగ్స్ త్వరితగతిన క్లియర్ చేయడానికి ఆయిల్ కంపెనీలు, గ్యాస్ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ అదనపు సరఫరా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# కళావేదికను నిర్మించి పాఠశాలకు అందచేత



సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో తాను చదువుకున్న శ్రీ కొండపల్లి గంగన్న మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తన తల్లిదండ్రులు కీ.శే నలమాటి లచ్చన్న లక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రముఖ వైద్యులు నలమాటి అమ్మన్న చౌదరి నిర్మించిన కళా వేదికను తానే లాంఛనంగా ప్రారంభించి పాఠశాలకు ఆదివారం అందచేశారు... ఈ కళావేదిక స్థానిక కళాకారులకు, విద్యార్థులకు, సాంస్కృతిక కార్యక్రమాలకు, సాహిత్య సమావేశాలకు, మరియు ఇతర అవగాహన సదస్సులకు ఉపయోగపడుతుంది అని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అమ్మన్న చౌదరి,నలమాటి దామోదర్ అబ్బాయి ,నలమాటి లక్ష్మణ్ సిద్దార్థ్ , పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పీతల నాగ శివ, టిడిపి నాయకులు గుమ్మళ్ళ రామకృష్ణ, గోలి శ్రీరామ్, నున్న వెంకటరాజు,పాలచర్ల సతీష్ కుమార్, మట్టపర్తి నవీన్ కుమార్, గద్దే సాయిరాం, ఉపాధ్యాయులు,యార్లగడ్డ బంగారాజు,వల్లూరి వీరభద్రరావు, నాగేశ్వరరావు, ఇబ్రహీం, శ్రీనివాస్ లు తదితరులు పాల్గొన్నారు.

# కాజులూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా చందాల బాబి



**- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక**

**కాజులూరు, మేజర్ న్యూస్ :** గొల్లపాలెం పిఎంపీ భవన్లో ఆదివారం నిర్వహించిన కాజులూరు మండల ప్రెస్ క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఇప్పటి వరకూ క్లబ్ అధ్యక్షుడిగా కొనసాగిన టీవీ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈఎన్నికల ప్రక్రియలో 20 మంది జర్నలిస్టులు పాల్గొని ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా చందాల వీరవెంకట సత్యనారాయణ (బాబి)(విశ్వం వాయిస్)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కార్యదర్శిగా చెల్లుబోయిన రాంబాబు (పల్లెజ్యోతి)ని, కోశాధికారిగా వరద వెంకటేశ్వరరావు (బాబీ)(మనసులో మాట)ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా తుమ్మలపల్లి సత్తిబాబు(ఆంధ్రజ్యోతి), పాలిక వీరబాబుల్ని ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శిలుగా నల్లమిల్లి బుజ్జిరెడ్డి(సాగర సాక్షి), బొక్కా రాజు(కోస్తా ఎన్ కౌంటర్)లను సభ్యులు ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా గెద్దాడ ప్రత్యూష(విశాలాంధ్ర), భూపతి రాజు బుచ్చిరాజు(స్కై విజన్), చొల్లంగి ఓంకార్(కలం కౌంటర్), గుబ్బల నాగేంద్ర కుమార్(సాక్ష్యం), కేజేఎం ఆర్ ఆంజనేయులు(పల్నాటి సాక్షి)లను ఎన్నుకున్నారు. సంఘ సభ్యులుగా దునే అనిల్(వార్త), రాయుడు గోవిందరావు (అమరావతి), సీహెచ్ త్రిమూర్తులు (తూర్పు ఉదయం), గవర వెంకటరమణ(ప్రభ న్యూస్), గంధం రాంబాబు(నేటి బ్రహ్మాస్త్రం)లను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కొత్తగా ఏర్పడిన కొత్త కార్యవర్గ ప్రతినిధులను సభ్యులు దుస్సాళువా, పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు అభినందించారు.

# జిల్లాలో గ్యాస్ కొరత లేదు

**- జిల్లా జాయింట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజు**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లాలో గ్యాస్ సిలిండర్లు కొరత లేకుండా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి స్మరణ్ రాజు తెలిపారు. ఇరాన్ ఇరాక్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఎల్పిజి గ్యాస్ కొరత ఉంటుందనే వదంతులు నమ్మవద్దని జిల్లాలో రోజుకు 900 గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తుండగా 2356 గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉంచాలని గ్యాస్ ఏజెన్సీలకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో గురుకుల,బీసీ, ఎస్సీ ఎస్సీ,ఎస్టీ, కేవీబీ కే, ఆశ్రమ పాఠశాలకు, వైద్య ఆరోగ్య వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు, ఇంటి అవసరాలకు కావలసిన గ్యాస్ సిలిండర్లుకు కొరత లేదన్నారు. గ్యాస్ నిల్వలు పంపిణీ పై నిరంతర పర్యవేక్షణ కొనసాగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కృత్రిమగ్యాస్ కొరత సృష్టించి అధిక నిల్వలు, అధిక రేట్లుకు విక్రయించే వారిపై అలానే డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్కు వినియోగిస్తే అటువంటి వారిపై నిత్యవసర సమాచార చట్టం 1955 ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులు సంయుక్తంగా గ్యాస్ ఏజెన్సీ లపైనిరంతర తనిఖీలు చేయడం జరుగుతు ందన్నారు.

## అదుపుతప్పి పంట పొలాల్లో పడిపోయిన టిప్పర్ లారీ



సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట శివారు జల్లూరు సమీపాన గ్రావెల్ లోడుతో వెళుతున్న లారీ వేగముగా వెళుతూ అదుపుతప్పి పంట కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్కు స్వల్ప గాయాలు ఐన్నట్లు పలువురు పేర్కొన్నారు. గ్రావెల్ టిప్పర్ లారీ వేగ నియంత్రణ లేకుండా వెళుతున్నామని,అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు బహిరంగ అధికారుల తీరును తప్పుబడుతున్నారు.

## సీనియర్ నాయకులు గోరంట్ల బుచ్చయ్య చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలోని బుచ్చయ్య చౌదరి నివాసానికి వెళ్ళిన మంత్రి దుర్గేష్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇరువురు నేతలు కాసేపు ఉత్సాహంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ "శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నాను. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వారు భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలందించాలని, ఎల్లప్పుడూ ప్రజాసేవలో ఉంటూ అందరికీ మార్గదర్శకంగా నిలవాలని కోరుకుంటున్నాను," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.